సాక్షి సూర్యాపేట

బుధవారం ၊ 6 ၊ నవంబర్ ၊ 2024



కారు బీభత్సం

మునగాల మండలం మాధవరం గ్రామ పరిధిలో విజయవాడ–హైదరాబాద్ హైవేపై కారు బీభత్సం సృష్టించింది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	: 586.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 41,352 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 41,352 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 25,291 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,443 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 5,018 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,200
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం : 643.65 అడుగులు

ఇన్‌ఫ్లో	: 887.95 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 646.87 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

సమయ పాలన పాటించాలి



మాట్లాడుతున్న డీఐఈవో భానునాయక్

సూర్యాపేటటౌన్ : అధ్యాపకులు, విద్యార్థులు సమయ పాలన పాటించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భానునాయక్ సూచించారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి మాట్లాడారు. కళాశాలలో విద్యార్థులకు స్టడీ అవర్ పెంచాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధికంగా ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదవాలని, చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పెరుమాళ్ల యాదయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం సేవించి స్కూల్‌కు వచ్చిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మోతె: మద్యం సేవించి పాఠశాలకు హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖ అధికారి సస్పెండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండల పరిధిలో రాంపురం తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నవిల ఉపేందర్ సోమవారం మద్యం సేవించి విధులకు హాజరయ్యారు. స్కూల్ ఆవరణలో స్పృహలేకుండా నిద్రపోయారు. గమనించిన విద్యార్థులు, గ్రామస్తులు.. సదరు ఉపాధ్యాయుడి ఫొటోలు, వీడియో తీసి విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపించడంతో పాటు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై ఎంఈఓ విచారణ చేసిన అనంతరం ఉపాధ్యాయుడు నవిల ఉపేందర్‌ను డీఈఓ అశోక్ సస్పెండ్ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలల్లో నిబంధనలు అతిక్రమించి వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట: ఆశా కార్యకర్తలు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కోటాచలం సూచించారు. మంగళవారం జిల్లాలోని అంబేద్కర్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన వైద్య సేవలు సలహాలు, సూచనలు చేయాలన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): సీపీఐ శత వార్షికోత్సవాలను ఏడాది పాటు ఊరూ–వాడా ఏకమై నిర్వహించాలని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పార్టీని మరింతబలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ లేని గ్రామాల్లో ప్రజాసంఘాలను నిర్మించడం ద్వారా విస్తృత పర్చవచ్చన్నారు. నవంబర్ 7వ తేదీ నుంచి డిసెంబర్ 26 వరకు పార్టీ ప్రజా సంఘాల సభ్యత్వం పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డిసెంబర్ 30న నల్లగొండ జిల్లా కేంద్రంలో శత వార్షికోత్సవాల సందర్భంగా బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రాములు, ధూళిపాళ ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాస్, నారాయణరెడ్డి, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, గుండు వెంకటేశ్వర్లు, ఎస్.కె లతీఫ్, దేవరం మల్లీశ్వరి, కోటమ్మ, సాహెబ్ అలీ, రమేష్, చిలక రాజు తదితరులు పాల్గొన్నారు.

పేట మార్కెట్‌కు 31,399 బస్తాల ధాన్యం

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం వరి ధాన్యం పోటెత్తింది. 31,399 బస్తాల ధాన్యం మార్కెట్ యార్డుకు అమ్మకానికి వచ్చింది. సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో దీపావళి తర్వాత వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనికి తోడుగా ప్రభుత్వ కొనుగోలు సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. కాంటాలు అయ్యేందుకు చాలా ఆలస్యం కావడంతో రైతులు నేరుగా వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. సోమవారం 38,715 బస్తాల ధాన్యం వచ్చింది. రెండోరోజు మంగళవారం 31,399 బస్తాలు రాగా.. అత్యధికంగా జైశ్రీరాం రకం 16,746 బస్తాలు ఉంది. గరిష్టంగా రూ.2416లు, కనిష్టంగా రూ.1409ల ధర పలికింది. తర్వాత ఐఆర్ 64 రకం 8356 బస్తాలు, బీపీటీలు 3124 బస్తాలు, హెచ్ఎంటీలు 2944 బస్తాల చొప్పున ధాన్యం వచ్చింది.



సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చిన ధాన్యం

7న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్లకు క్రీడాకారుల ఎంపిక

హుజూర్‌నగర్ : ఈనెల 7న సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి ఆజం బాబా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–17 విభాగంలో బాలబాలికలు, అండర్ –14 విభాగంలో బాలురకు ఖోఖో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి వచ్చే క్రీడాకారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులచే ధ్రువీకరించిన బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

సమగ్ర సర్వేకు రెడీ..

- నేటి నుంచి 8వతేదీ వరకు ఇళ్ల గుర్తింపు ప్రక్రియ
- 9వతేదీ నుంచి 75 ప్రశ్నలతో కుటుంబ సర్వే
- మూడు వారాలపాటు కొనసాగనున్న ప్రక్రియ
- సర్వే వివరాలు ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు



గ్రామ పంచాయతీలు	475
మున్సిపాలిటీలు	5
అధికారుల అంచనా ప్రకారం ఇళ్లు	3.58 లక్షలు
ఎన్యూమరేటర్లు	2,603
ఎన్యూమరేటర్ బ్లాక్‌లు	2800
సూపర్‌వైజర్లు :	264

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేకు సర్వం సిద్ధమైంది. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకు మూడు వారాల పాటు ఈ సర్వే కొనసాగనుంది. దీనికి అవసరమైన సిబ్బంది ఎంపిక, శిక్షణను సైతం పూర్తి చేశారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఎన్యూమరేటర్లు ఇళ్ల గుర్తింపు ప్రక్రియ చేపట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3.58 లక్షల ఇళ్లు ఉండనున్నట్లు అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది.

మూడురోజుల పాటు..

సమగ్ర కుటుంబ సర్వే కోసం జిల్లాను 2,800 బ్లాక్‌లుగా విభజించి 2603 మంది ఎన్యూమరేటర్లను ఎంపిక చేశారు. ఈ ఎన్యూమరేటర్లు చేసిన సర్వేను పర్యవేక్షించేందుకు మరో 264 మంది సూపర్‌వైజర్లను సైతం నియమించారు. ఇప్పటికే ఈనెల 1వ తేదీ నుంచి శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు ఇళ్లను గుర్తించి జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఒక్కో ఎన్యూమరేటర్ 150 నుంచి 175 ఇళ్ల జాబితాను రూపొందించాల్సి ఉంది. అయితే మారిన షెడ్యూల్ ప్రకారం బుధవారం నుంచి మూడురోజుల పాటు కూడా ఈ ప్రక్రియ కొనసాగనుంది. ప్రభుత్వ ఆదేశాల తర్వాత ఈనెల 9వ తేదీ నుంచి 75 ప్రశ్నలతో కూడిన సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యూమరేటర్లు చేపట్టనున్నారు.

ఏరోజుకారోజు ఆన్‌లైన్

ఒక్కో ఎన్యూమరేటర్‌కు సర్వే కోసం 150 నుంచి 175 ఇళ్లను కేటాయించనున్నారు. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్లను మూడు వారాల్లో పూర్తి చేయాల్సి ఉంది. ఏ రోజుకారోజు సర్వేకు సంబంధించిన ఫారాలను సూపర్‌వైజర్‌కు అందిస్తే వాటిని మండల స్థాయిలో ఆన్‌లైన్ చేయనున్నారు.

అవగాహన కల్పిస్తేనే..

తెలంగాణ ప్రభుత్వం ఈ ఇంటింటి సమగ్ర సర్వేను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ప్రజల జీవన విధానం తెలియడంతో పాటు కుల గణన ఉండడంతో బీసీల లెక్క తేలనుంది. అయితే ప్రస్తుతం జిల్లాలో పత్తితీత పనులతో పాటు వరికోతలు, కొనుగోలు కేంద్రాల వద్దకు రైతుల రాకపోకలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్వే సిబ్బంది ఇళ్లకు వచ్చిన సమయంలో కుటుంబ సభ్యులు లేకపోతే మళ్లీ రావాల్సి ఉంది. ఇలా ఒక్కో ఇంటికి రెండు, మూడుసార్లు రావాల్సి ఉండడంతో సర్వే సిబ్బందికి ఇబ్బందులు కలగనున్నాయి. ఈ క్రమంలో జిల్లా ప్రజలకు ఈ సర్వేపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరి సర్వే పకడ్బందీగా జరగనుంది.

మాకు న్యాయం చేయాలి

- మా జీతాలు లోన్ ఈఎంఐలకే పోతున్నాయి
- ఏడాది కాలంగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు
- సూర్యాపేట ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ చేతిలో మోసపోయిన పలు శాఖల ఉద్యోగుల ఆవేదన
- బ్యాంకు ఎదుట బాధితుల ఆందోళన



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న పలు శాఖల ఉద్యోగులు

సూర్యాపేట : సూర్యాపేట ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ చేసిన మోసానికి తమ జీతాలు లోన్ ఈఎంఐలకే పోతున్నాయని పలు శాఖల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఎదుట బాధిత ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ 2022 నుంచి సూర్యాపేట ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో మేనేజర్‌గా పనిచేసిన షేక్ సైదులు గతంలో బ్యాంకులో లోను తీసుకున్న పలు శాఖల ఉద్యోగులు 33 మంది పేర ఫోర్జరీ సంతకాలతో తమకు తెలియకుండా తిరిగి లోన్ తీసుకున్నాడని ఆరోపించారు. సదరు బ్రాంచ్ మేనేజర్ పర్సనల్ లోన్, టాప్ అప్ లోన్ పేరుతో ఉద్యోగుల పత్రాలు తీసుకొని అనంతరం తమకు లోను రాదని చెప్పి ఆ లోను తాను తన ఖాతాలో వేసుకున్నట్లు తెలిపారు. ఒక్కో ఉద్యోగి పేర రూ.15లక్షల నుంచి రూ.25 లక్షల వరకు లోన్ తీసుకున్నట్లు బాధితులు చెప్పారు. 2023 జూన్‌లో సదరు బ్రాంచ్ మేనేజర్ రామంతాపూర్ ట్రాన్స్‌ఫర్ కాగా అక్కడ కూడా ఇలాగే చేస్తుండడంతో జనవరి 23న పట్టుకున్నారన్నారు. అప్పటి వరకు తమ పేర తీసుకున్న బ్యాంకు రుణాలకు ఈఎంఐ లను సదరు బ్రాంచ్ మేనేజర్ సైదులు చెల్లించాడని తెలిపారు. ఆ తర్వాత ఆ లోన్లకు సంబంధించిన ఈఎంఐ లు తమ జీతాల నుంచి కట్ అవుతుండడంతో అనుమానం వచ్చి బ్యాంకులో సంప్రదించామన్నారు. అప్పుడు విషయం బయటకు రావడంతో బ్యాంకు రీజనల్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్‌లను కలిసి విషయం తెలిపినప్పటికీ తమకు న్యాయం జరగడం లేదన్నారు. ఏడాది కాలంగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నామని, బ్రాంచ్ మేనేజర్ తీసుకున్న లోన్లకు తమ జీతాల నుంచి ఈఎంఐలు కట్ అవుతున్నాయన్నారు. వచ్చిన జీతం మొత్తం ఈఎంఐ లకే పోతుండడంతో కుటుంబాలు గడిచే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు బ్రాంచ్ మేనేజర్‌ను పోలీసులు ఇప్పటికే కస్టడీలోకి తీసుకున్నారని, ఆయన కూడా తమ లోన్లు తీసుకున్నట్లు అంగీకరించాడని అయినప్పటికీ బ్యాంకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి తమ జీతాల నుంచి బ్రాంచ్ మేనేజర్ తీసుకున్న లోన్ల ఈఎంఐ లను మినహాయించాలని కోరారు.

మద్యం అమ్మొద్దు.. తాగొద్దు

- సంపూర్ణ మద్యపాన నిషేధానికి బోరింగ్‌తండా వాసుల తీర్మానం
- అమ్మినా.. తాగినా జరిమానా విధించాలని నిర్ణయం



సమావేశంలోమాట్లాడుతున్న మహిళలు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): తండావాసులంతా ఏకమయ్యారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేస్తున్న మద్యం మహమ్మారిని తరిమికొట్టాలని నిర్ణయించారు. వందలాదిమంది అఖిలపక్షాల నేతలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశమై తండాలో మద్యం అమ్మవద్దని, ఎవరూ తాగవద్దని తీర్మానించారు. ఒకవేళ ఎవరైనా విక్రయించినా, తాగినా జరిమానాలు విధించాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రతిజ్ఞ కూడా చేశారు. గ్రామంలో బెల్టు, మద్యం దుకాణాలను వెంటనే మూసివేయాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుగులోతు గణేష్, చాంప్లా, కుమార్, సురేందర్, శ్రీనివాస్, శేఖర్, వీరన్న, ప్రేమ్ కుమార్, నందు పార్వతి, పద్మ, బుజ్జి, చంద్రకళ, కల్పన, మంజుల, మండల జేఏసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యం కలిగి ఉండాలి

చివ్వెంల(సూర్యాపేట) : విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని కలిగి ఉండాలని సూర్యాపేట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. గోవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం సూర్యాపేట పట్టణంలోని గిరిజన మహిళా రెసిడెన్షియల్ డిగ్రీకాలేజీని తనిఖీ చేశారు. మౌళిక వసతులను పరిశీలించి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యమైన భోజనం అందించాలని కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పద్మజ , కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

డీఏలు, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న టీపీయూఎస్ నాయకులు

సూర్యాపేట : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతం సంధ్యారాణి, యామా రమేష్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంపై మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట టీపీయూఎస్ ఆధ్వర్యంలో ప్లకార్డు లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు బకాయి ఉన్నాయని, ఈ కుబేర్ లో జీపీఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్ లు, సరెండర్ లీవ్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. పీఆర్సీ కమిటీ నివేదిక ప్రకటించి తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి హరిప్రసాద్, అమరవాది బ్రహ్మచారి, భైరు తిరుమలేశ్, నేరెళ్ల దేవరాజ్, మంచాల రవికుమార్, బాణోత్ పూల్‌సింగ్, రామినేని శ్రీనివాస్, నాగవెల్లి ప్రభాకర్, శ్రీనివాసరావు, సాయికుమార్, సురభి శ్రీధర్, వెంకట్ రెడ్డి, కోటిరెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , శ్రీదేవి, జేజాల శ్రీదేవి, యమా సంతోష్ పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యం తేవాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



బాలెంల కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట: రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. మంగళవారం సూర్యాపేట మండల పరిధిలోని బాలెంల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. సన్న ధాన్యానికి ప్రభుత్వం అందించే రూ. 500బోనస్‌ను పొందాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలని ఐకేపీ నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రహదారులపై ఎట్టి పరిస్థితుల్లో ధాన్యాన్ని ఆరబెట్టవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట డీఆర్‌డీఓ అప్పారావు, ఏపీడీ సురేష్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, డీటీ నాగలక్ష్మి, ఏపీఎం వెంకయ్య, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నడిగూడెం : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నడిగూడెం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులైనా కొనుగోళ్లు వేగం పుంజుకోక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్, కొలిశెట్టి యాదగిరిరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, ఏనుగుల వీరాంజనేయులు, లతీఫ్‌బాబు పాల్గొన్నారు.

నాగుల చవితి పూజలు



నాగుల చవితి సందర్భంగా మంగళవారం సూర్యాపేట పట్టణం చంద్రన్నకుంటలో గల నాగులమ్మగుడిలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

సీఎం మూసీ బాట

- ఈనెల 8న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ పునరుజ్జీవ పాదయాత్ర
- భీమలింగం కత్వ వద్ద పూజలు చేయనున్న సీఎం
- రైతులతో మాటామంతి
- యాదాద్రీశుడి దర్శనం అనంతరం మిషన్ భగీరథ పైలాన్ ఆవిష్కరణ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు



సంగెం వద్ద సీఎం పాదయాత్ర స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు

సాక్షి, యాదాద్రి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 8వ తేదీన జిల్లాలోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించనున్నారు. తన పుట్టిన రోజు కావడంతో ముందుగా యాదాద్రీశుడిని దర్శించుకుంటారు. అనంతరం వలిగొండ మండలంలోని సంగెం సమీపంలో ఉన్న భీమలింగం కత్వ వద్ద ప్రత్యేక పూజలు చేయనున్నారు. అక్కడే మూసీ నది జలాలు పరిశీలించనున్నారు. అక్కడి నుంచి ధర్మారెడ్డి కాల్వ కత్వ వరకు మూడు కిలోమీటర్ల మేర మూసీ పునరుజ్జీవ పాదయాత్ర చేయనున్నారు. ఈసందర్భంగా మూసీ నది మురుగు నీటితో రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకోనున్నారు. అదేమార్గంలో మూడు కిలోమీటర్లు వెనక్కి వచ్చి సంగెం వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మొత్తం ఆరు కిలోమీటర్లు సీఎం రేవంత్ రెడ్డి మూసీ వెంట పాదయాత్ర చేస్తూ పునరుజ్జీవం గురించి జిల్లా ప్రజలకు వివరించనున్నారు. అయితే వలిగొండ మండలం నాగారం నుంచి రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం వరకు మూసీ నది వెంట సీఎం పర్యటించే మరో అవకాశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. యాదాద్రిలో ప్రత్యేక పూజల అనంతరం ప్రెసిడెన్షియల్ సూట్‌లో జిల్లాకు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం యాదగిరిగుట్టలో మిషన్ భగీరథ పైలాన్‌ను ప్రారంభించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

వలిగొండ: వలిగొండ మండలంలోని సంగెం సమీపంలో గల భీమలింగం కత్వ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టే మూసీ పునరుజ్జీవ పాదయాత్ర స్థలాన్ని, రైతులు, కులవృత్తుల వారితో నిర్వహించే సభా స్థలాన్ని మంగళవారం ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలుష్య కాసారంగా మారిన మూసీ నది పునరుజ్జీవం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం నాగారం సమీపంలోని ఆసిఫ్ నగర్ కాల్వ, రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెం చెరువు కత్వను పరిశీలించారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఏసీపీ మధుసూదన్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారిణి లావణ్య, ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి యాదయ్య, రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై యుగంధర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సాక్షి,యాదాద్రి: జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంత రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. యాదాద్రి దేవస్థానం, మూసీ పునరుజ్జీవన కార్యక్రమంలో సీఎం పాల్గొంటారని, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. పోలీస్ శాఖ పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, భువనగిరి ఏసీపీ రవి కిరణ్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్ రెడ్డి, యాదాద్రి దేవస్థానం ఏసీపీ సైదులు, ఎక్సైజ్ ఈఎస్ సైదులు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదాద్రి కలెక్టర్

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం


అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణితో 108 సిబ్బంది

చివ్వెంల (సూర్యాపేట): పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట హాస్పిటల్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో ప్రసవించింది. ఈ ఘటన చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామంలో జరిగింది. మోతె మండలం విభలాపురం గ్రామానికి చెందిన గంట శోభారాణి మంగళవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. గ్రామానికి చేరుకున్న 108 సిబ్బంది అంబులెన్స్‌లో శోభారాణిని డెలివరీ కోసం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలిస్తుంగా మార్గమధ్యలో బీబీగూడెం గ్రామ శివారుకు చేరుకోగానే నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ ఉల్లోజు సైదులు ఆమెకు నార్మల్ డెలివరీ చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శోభారాణి కుటుంబ సభ్యులు ఈఎంటీ సైదులు, పైలెట్ గోగుల సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

కోదాడరూరల్ : కోదాడ మండలం కూచిపూడి తండాకు చెందిన యువకుడిపై కొందరు యువకులు దాడి చేయగా.. అవమాన భారంతో అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కూచిపూడితండాకు చెందిన తేజావత్ సాయిభగవాన్(24) కోదాడలోని ఓ పూల దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి సాయిభగవాన్ పూల దుకాణం వద్ద ఉండగా.. బాలాజీనగర్‌కు చెందిన పవన్, నందులాల్, సిద్దు, నవీన్, కూచిపూడితండాకు చెందిన సాయి మరికొందరు వచ్చారు. 'పవన్ చెల్లిని ప్రేమ పేరుతో ఎందుకు వేధిస్తున్నావు.. నీతో మాట్లాడాలి' అని సాయిభగవాన్‌ను బయటకు రమ్మన్నారు. దీంతో సాయిభగవాన్ తన స్నేహితుడు ప్రకాష్‌ను తీసుకొని బైక్‌పై హుజూర్‌నగర్ ఫ్లైవర్ బ్రిడ్జి వద్దకు వెళ్లగా.. అక్కడ సాయిభగవాన్‌పై వారందరూ కలిసి దాడి చేశారు. దీంతో అవమాన భారం భరించలేక కూచిపూడితండాకు వెళ్లిన సాయిభగవాన్ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కింద పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి


నాగేశ్వర్‌రావు (ఫైల్)

నల్లగొండ క్రైం: పని ప్రదేశంలో అదుపు తప్పి కిందపడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణ పరిధి లోని బీటీఎస్‌లో మంగళవారం జరిగింది. వివరాలు.. నల్లగొండ పట్ట ణంలోని కేశరాజుపల్లి ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పొనుగోటి నాగేశ్వర్‌రావు(35) మంగళవారం బీటీఎస్‌లోని షంషునగర్‌లో తిప్పర్తి డిప్యూటీ తహసీల్దార్ ఆశయ్య ఇంట్లో రేకుల షెడ్డు ఏర్పాటు చేసేందుకు గోడ కడుతుండగా అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అన్న వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

తెలంగాణ బియ్యానికి డిమాండ్

- రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్


ఆర్జాలబావి కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఎస్ చౌహాన్

నల్లగొండ రూరల్: తెలంగాణ రాష్ట్ర బియ్యానికి జాతీయ స్థాయిలో డిమాండ్ ఉందని పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. రాష్ట్రంలో ఉన్న 2 కోట్ల 80 లక్షల రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సన్న ధాన్యం దిగుబడిని ప్రోత్సహించేందుకు రూ. 500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు. నల్లగొండ పట్టణ సమీపంలో నిర్వహిస్తున్న పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక కార్యదర్శి అనితారామచంద్రన్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు ఎలా సాగుతున్నాయి, ఖాతాలో ఎన్ని రోజులకు డబ్బులు జమ అవుతున్నాయి అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 143 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, ఇందులో 80 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం రానుందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో కూడా గతంలో లేదన్నారు. రాష్ట్ర ప్రజల అవసరాలకు 36 లక్షల టన్నుల సన్న ధాన్యం అవసరమని, మనం పండిస్తున్న 80 లక్షల మెట్రిక్ టన్నుల్లో కనీసం 50 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చినా రాష్ట్ర అవసరాలు తీరుతాయన్నారు. అకాల వర్షానికి ధాన్యం తడిస్తే అరబెట్టేందుకు రాష్ట్రంలో 100 హైస్పీడ్ డ్రయ్యర్‌లు కొనుగోలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొన్ని రాష్ట్రాలు, కొన్ని దేశాల వారికి తెలంగాణ బియ్యం శాంపిల్ పంపించగా భారీ ఎత్తున బియ్యం కావాలని అడిగినట్లు తెలిపారు. క్వాలిటీగా రైతులు ధాన్యం పండిస్తున్నారని, మన దగ్గర పండే బియ్యం బ్రాండ్‌గా మారబోతుందన్నారు. తూకం ఎక్కువగా వేస్తే అధికారులకు రైతులు హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రైతుల సమస్యలు తెలిపేందుకు కొనుగోలు కేంద్రాల ద్వారా వివరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధాన్యం దిగుమతి, ఎగుమతిలో ఎలాంటి సమస్య రాకుండా అధికారులతో కమిటీలు వేసి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడం వల్ల కొనుగోలు సులభంగా జరుగుతుందన్నారు. కొనుగోలుదారులు మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో ఆర్డీవో అశోక్‌రెడ్డి, గొల్లగూడ పీఏసీఎస్ చైర్మన్ అలకుంట్ల నాగరత్నంరాజు, డీఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీసీవో సత్యానాయక్ పాల్గొన్నారు.

46 ఏళ్ల ఎదురుచూపులకు తెర

- ప్రజావాణిలో పట్టాదారు పాసుపుస్తకం సమస్యకు లభించిన పరిష్కారం


ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి చేతుల మీదుగా పాసుపుస్తకం అందుకుంటున్న పిచ్చయ్య

కట్టంగూర్: 46 ఏళ్లుగా పట్టాదారు పాసుపుస్తకం కోసం తిరుగుతున్న రైతు నిరీక్షణకు తెరపడింది. ప్రజావాణిలో కార్యక్రమంలో సమస్యకు పరి ష్కారం దొరకడంతో ఆ రైతు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు. కట్టంగూర్ మండలం ఎరసానిగూడేనికి చెందిన కొమ్మనబోయిన పిచ్చయ్యకు 1978లో గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 215/3లో గల ఎకరం భూమికి రెవెన్యూ అధికారులు పట్టా సర్టిఫికెట్ మంజూరు చేసి పాసుపుస్తకం ఇవ్వలేదు. నాటి నుంచి నేటి వరకు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. ఆన్‌లైన్‌లో, 1–బీలో 30 గుంటల భూమి ఉండటంతో పాసుపుస్తకం కొరకు దరఖాస్తు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. 1978లో పొందిన ఎకరం పట్టా సర్టిఫికెట్ ఆధారంగా 46 ఏళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పాసుపుస్తకం పొందలేకపోయాడు. సీఎం రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన ప్రజావాణి విషయం తెలుసుకున్న పిచ్చయ్య పట్టాదారు పాసుపుస్తకం కోసం జూలైలో దరఖాస్తు చేసుకోవడంతో ప్రజా వాణిలో పరిష్కారం లభించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య పిచ్చయ్యకు అసైన్డ్ పాసుపుస్తకం అందజేశారు. ప్రజావాణిలో దరఖాస్తు చేసుకొన్న 100 రోజుల్లోపే పాసుపుస్తకం చేతికి అందటంతో పిచ్చయ్య సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం

- టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టి పాదచారుల పైకి దూసుకెళ్లడంతో మహిళ మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు


పిచ్చమ్మ (ఫైల్)

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కారు బీభత్సం సృష్టించింది. టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టి, పాదచారుల పైకి దూసుకెళ్లడంతో ఓ మహిళ మృతిచెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మునగాల మండలం మాధవరం గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధవరం గ్రామానికి చెందిన నల్లగొండ పిచ్చమ్మ(45) తన కుమారుడు నవీన్‌తో కలిసి తమ పొలానికి మందు స్ప్రే చేసేందుకు టీవీఎస్ మోపెడ్‌పై విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి గుండా వెళ్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి టీవీఎస్ మోపెడ్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిచ్చమ్మ, నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే కారు మాధవరం గ్రామానికే చెందిన వల్లావుల వెంకన్న, అతడి కుమారుడు మధు, మన్నెం లింగయ్య కలసి హైవేపై నడుచుకుంటూ వెళ్తుండగా వారిని కూడా ఢీకొట్టింది. దీంతో వారు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పిచ్చమ్మ మృతిచెందింది. ఆమె కుమారుడు నవీన్‌ను మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కారు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి: విధుల్లో ఉన్న అసిస్టెంట్ లైన్‌మెన్‌పై దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... భూదాన్‌పోచంపల్లి మండలం జగత్‌పల్లి గ్రామానికి చెందిన బింగి ఈశ్వర్ ఇంటికి ఈ నెల 2వ తేదీన అసిస్టెంట్ లైన్‌మెన్ గుగులోతు వెంకటేశ్ మీటర్ రీడింగ్ తీసేందుకు వెళ్లాడు. అదే సమయంలో ఈశ్వర్‌కు చెందిన కుక్క కరవడానికి వెంకటేశ్ మీదకు రావడంతో అతడు భయంతో తన చేతిలో ఉన్న కటింగ్ ప్లేయర్‌ను కుక్కపై విసిరాడు. దీంతో ఆగ్రహించిన ఈశ్వర్ కులం పేరుతో వెంకటేశ్‌ను దూషిస్తూ అతడిపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం, కులం పేరుతో దూషించినందుకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కట్టెల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

పెన్‌పహాడ్ : కట్టెల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి కట్టెల లోడుతో మహారాష్ట్రకు వెళ్తున్న లారీ సింగారెడ్డిపాలెం గ్రామ శివారులోని చెరువు మూలమలుపు వద్ద అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ క్షేమంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

చివ్వెంల(సూర్యాపేట): ఒంటిపై పెట్రోల్ పోసుకుని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కుడకుడ గ్రామానికి చెందిన అబ్దుల్ పాష ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. పాష ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై ఎస్‌ఐ వి. మహేశ్వర్‌ను వివరణ కోరగా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు


హెలిపాడ్ చుట్టుపక్కల పిచ్చి మొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

యాదగిరిగుట్ట: సీఎం రేవంత్‌రెడ్డి 8వ తేదీన యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు రానున్న నేపథ్యంలో కొండ దిగువన పాత గోశాల సమీపంలోని యాగ స్థలంలో హెలిప్యాడ్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. యాగ స్థలంలో రెండు హెలిపాడ్ల వద్ద ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు స్థానిక మున్సిపల్ సిబ్బంది, ప్రత్యేక సిబ్బందితో కలిసి తొలగించే పనులు చేపట్టారు. ఒక హెలిపాడ్ చుట్టూ సీసీ, కాంక్రీట్ తొలగిపోవడంతో అక్కడ మరమ్మతులు చేసి ఎర్ర మట్టిని పోశారు. 7వ తేదీ వరకు హెలిపాడ్ వద్ద పనులన్నీ పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

లారీని ఢీకొట్టిన బైక్.. ఇద్దరికి గాయాలు



గాయపడిన దాని, స్టాన్లీ

చౌటుప్పల్ రూరల్: లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టి ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఎస్. దాని, ఏలూరు పట్టణానికి చెందిన సాదదాసి స్టాన్లీ బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో దండుమల్కాపురం ఎక్స్ రోడ్డు వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న దాని తలకు బలమైన గాయాలు కాగా, స్టాన్లీకి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి..

సూర్యాపేట: రోడ్డు వెంట ఆగి ఉన్న ధాన్యం ట్రాక్టర్‌కు బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం దోరకుంట గ్రామానికి చెందిన షేక్ అఫ్రోజ్, వీరప్రసాద్ స్నేహితులు. వీరిద్దరు మంగళవారం బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా రాయినిగూడెం సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి వెంట ధాన్యం లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అఫ్రోజ్‌కు తీవ్ర గాయాలు కాగా.. వీరప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అఫ్రోజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఖమ్మం తీసుకెళ్లారు.

వాగు దాటుతూ రైతు మృతి


నర్యానాయక్ మృతదేహం

దేవరకొండ: వాగు దాటుతూ రైతు మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి దేవరకొండ మండలం దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని బుడ్డతండా సమీపంలో జరిగింది. మంగళవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుడ్డతండాకు చెందిన నేనావత్ నర్యానాయక్(52) తన పొలంలో పండించిన ఆకుకూరలను దేవరకొండలో అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా సోమవారం ఉదయం తండా నుంచి ఆకుకూరలు అమ్మేందుకు దేవరకొండకు వచ్చాడు. పొద్దుపోయాక తండాకు తిరుగుముఖం పట్టాడు. తండాకు సరైన రోడ్డు మార్గం లేకపోవడం, తండాకు వెళ్లే మార్గంలో మైనంపల్లి వాగు పారుతుండడంతో ప్రమాదవశాత్తు కాలు జారి నీట మునిగాడు. సోమవారం రాత్రి వరకు నర్యానాయక్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం తండాకు చెందిన పలువురు నర్యానాయక్ వాగులో మృతిచెంది ఉండడాన్ని గమనించి మృతదేహాన్ని బయటకి తీశారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పరామర్శించిన ఎమ్మెల్యే బాలునాయక్


వాగు దాటుతూ తండాకు చేరుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్

విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ వాగు దాటి తండాకు చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబానికి సీఎం సహాయనిధి నుంచి రూ.5లక్షలు ఆర్థికసాయం అందించాలంటూ నల్లగొండ జిల్లా కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. తండా నుంచి వాగు మీదుగా బ్రిడ్జి నిర్మించాలని తండా వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే బాలునాయక్ ఉన్నతాధికారులతో మాట్లాడి లోలెవల్ బ్రిడ్జి నిర్మించి శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.

వివాహితపై కత్తితో దాడి చేసిన యువకుడు

కోదాడరూరల్: కోదాడ పట్టణ పరిధిలోని నయానగర్‌లో ఉంటున్న వివాహితపై యువకుడు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నయానగర్‌కు చెందిన రేణుక ఇంట్లోనే ఉంటుండగా.. ఆమె భర్త మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అనంతగిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీగా చెప్పుకుంటున్న బాబు మంగళవారం సునీత ఇంట్లో ఎవరూ లేని సమయంలో వచ్చి ఆమె మెడ, తలపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. స్థానికులు సునీతను చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ దాడికి గల కారణాలు తెలియరాలేదు. దాడికి పాల్పడిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

గంజాయి కేసులో ముగ్గురు యువకుల అరెస్ట్

మేళ్లచెరువు: గంజాయి తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సింహాద్రి నాగరాజును మేళ్లచెరువు మండల కేంద్రంలో ఈ నెల 2వ తేదీన పోలీసులు అరెస్ట్ చేయగా.. అతడిచ్చిన సమాచారం మేరకు మండల కేంద్రానికి చెందిన యామపంగు మహేష్, మంగళంపల్లి సిసింద్రి, బుస్సా నరేష్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగరాజు గంజాయిని వీరి ముగ్గురికి ఇచ్చేందుకు వస్తుండగా.. పట్టుకున్నట్లు పోలీసుల తెలిపారు.

నేడు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి. నరేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ ఉత్పత్తులను స్టాళ్లలో ప్రదర్శించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయానికి సంబంధించిన నమూనాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామీణ యువత కేవీకేలో మృత్తికా శాస్త్రవేత్త ఎ. కిరణ్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

ధాన్యం నిల్వ చేసుకోండిలా..

- వడ్లు ఆరబెడితేనే తేమ శాతం తగ్గుతుంది
- నీరు, ఎలుకలు, ఇతర కీటకాలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- రైతులకు పెద్దవూర ఏఓ సందీప్ సూచనలు

పాడిపంట

పెద్దవూర: వానాకాలం వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు తాము పండించిన ధాన్యంలో కొంతభాగాన్ని రైస్ పట్టించడానికి నిల్వచేసుకుంటుంటారు. మరికొందరు రైతులు వడ్లు కొనుగోలు చేసి ఇంట్లోనే బస్తాల్లో నిల్వ ఉంచుకుంటారు. ఇంట్లో బియ్యం అయిపోగానే నిల్వ చేసిన వడ్ల మిల్లుకు తీసుకెళ్లి బియ్యం పట్టించుకుంటారు. ఇంకొందరు సీజన్ ప్రారంభంలో ధర తక్కువగా ఉంటుందని భావించి ధాన్యాన్ని విక్రయించకుండా అధిక ధర వచ్చేదాకా ఇంట్లోనే నిల్వ చేసుకుని ధర రాగానే అమ్మేస్తుంటారు. ఈ క్రమంలో ధాన్యం నిల్వ చేసుకొనుటలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పండించిన పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం ఉంటుందని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ అంటున్నారు. ధాన్యం నిల్వ చేసుకోవడంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచిస్తున్నారు.


ఆరబోసిన వడ్లు

నూర్పిడి తర్వాత ఇలా..

ధాన్యం నూర్పిడి తర్వాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికిపైగా భద్రపరచాల్సి ఉంటుంది. దీంతో ధాన్యం రంగు, రుచి తగ్గుతుంది. సాధారణంగా వరికోతల సమయంలో ధాన్యంలో 20శాతం తేమ ఉంటుంది. గతంలో కూలీలచే వరికోతలు కోయించేవారు. కూలీలచే వరి పంటను కోసిన తర్వాత వరి పనలను ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. ధాన్యంలో 14 శాతానికి తేమ ఉంటే బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. కాని ప్రస్తుతం రైతులు కూలీలపై ఆధార పడకుండా యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. కాబట్టి పంట పచ్చగా ఉన్నప్పుడే వరికోతలు కోస్తున్నారు. దీంతో ధాన్యంలో మరింత తేమ ఉండే అవకాశాలు మెండుగా ఉంటాయి. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ శాతం 14లోపు వచ్చేదాక చూసుకోవాల్సి ఉంటుంది.

ధాన్యాన్ని నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగచేస్తాయి. అంతే కాక ఎలుకలు ధాన్యాన్ని తినడమేకాక, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

నిల్వ ఉంచిన ధాన్యాన్ని నష్టపరిచే కీటకాలు

ముక్క పురుగు : పంట కోయడానికి ముందు నుంచి ముక్క పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్ల ని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుక : ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడువాసన వస్తుంది. తల్లి కీటకం వడ్ల గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకుని పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పై పొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటకు వస్తుంది. ఇది వడ్ల మూటలు, గిడ్డంగులపై కనిపిస్తుంది.

నుసి పురుగు : దీనినే పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా 3 మి.మీ పొడవు ఉంటుంది. ప్రౌఢ కీడకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తరువాత గింజ పైపొరను, ఆ తర్వాత లోపలి బియ్యపు గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది.

ఎలుకల నివారణకు చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేస్తుండాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెస్ మూతలు అమర్చాలి. ఇటువంటి జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ రోజులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి..

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు గుమ్ములు, సిమెంట్, లోహపు గాదెలు వినియోగించుకోవాలి. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాములు లేదా గిడ్డంగులను సిమెంట్ కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. ముఖ్యంగా కీటకాలు, తేమ, వర్షం నీరు లోనికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచులపైన, లోపల మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. మరునాడు సంచులను ఎండలో ఆరబెట్టాలి.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

మిర్యాలగూడ టౌన్: భార్య, చిన్న కుమారుడు మృతిచెందడంతో ఒంటరి జీవితం గడుపుతున్న వ్యక్తి మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం మిర్యాలగూడ మండలం పరిధిలోని లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాతకోటి సైదులు(55) పక్కనే ఉన్న ఆలగడప గ్రామ చెరువుకు కాపలాగా ఉంటూ అక్కడే ఉంటున్నాడు. అప్పుడప్పుడు లక్ష్మీపురంగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. సైదులు భార్య 20 ఏళ్ల క్రితమే చనిపోగా, మూడేళ్ల క్రితం అతడి చిన్న కుమారుడు మృతి చెందాడు. పెద్ద కుమారుడికి వివాహం కావడంతో అతడు విడిగా ఉంటుండగా.. సైదులు ఒంటరిగానే జీవనం సాగిస్తున్నాడు. ఒంటరి జీవితంతో మనస్తాపానికి గురైన చెందిన సైదులు రోజు మాదిరిగానే మంగళవారం లక్ష్మీపురం గ్రామంలోని రామాలయం వద్దకు వచ్చి ఆలయంలో స్వామివారికి దండం పెట్టుకొని పురుగుల మందు తాగుతుండగా.. స్థానికులు గమనించి వెంటనే అతడిని 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. మృతుడి పెద్ద కుమారుడు యేలేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.